ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 1 ఆగస్టు 2025

కాణిపాకంలో బ్రహ్మోత్సవ పనులకు శ్రీకారం



ప్రధాన ఆలయానికి వేస్తున్న రంగులు

ఐరాల(కాణిపాకం), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఈనెల 27వ తేదీనుంచి ప్రారంభం కానున్న వార్షిక బ్రహోత్సవాలకు వరసిద్ధుడి ఆలయం ముస్తాబవుతోంది. గురువారం నుంచి ఆలయానికి రంగులు వేసే పనులు ప్రారంభమయ్యాయి. తొలుత ప్రధాన ఆలయ రాజగోపురానికి, సుపథ మండపానికి రంగులు వేస్తున్నారు. తర్వాత అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి, మణికంఠేశ్వరాలయాలతోపాటు గణేష్ సదన్,వినాయక సదన్‌కు రంగులు వేయనున్నారు. దీంతోపాటు ప్రధాన ఆలయం నుంచి అగరంపల్లె వరకు విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై '5న టీ తాగుతూ మాట్లాడుకుందాం'

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడి వెల్లడి

చిత్తూరు అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ఈనెల 5వ తేదీన 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య వెల్లడించారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా ఉద్యోగ సంఘ నేతలు, తాలూకా ఆఫీస్ బేరర్లకు జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులకు రూ.25వేల కోట్ల వరకు రావాల్సి ఉందని, దాదాపు 12 రకాల సమస్యలను మూడు నెలలపాటు ఈ కార్యక్రమం ద్వారా చర్చించాలన్నారు. అనంతరం రాష్ట్ర సంఘానికి నివేదించి తదుపరి కార్యాచరణకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ బాబు, కోశాధికారి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు 4,090 పెరిగాయి

చిత్తూరు సెంట్రల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా మొదలు కానుంది. ఈదఫా 4,090 పింఛన్లు పెరిగాయి. జూన్‌లో 2,65,722 పింఛన్లు ఉండగా, జూలై మాసానికి ఈ సంఖ్య 2,69,812కు చేరింది. పంపిణీకి అవసరమైన రూ.115.29 కోట్లు జిల్లాకు వచ్చాయి. వీటిని గ్రామ, వార్డు ఉద్యోగులు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సొమ్ము అందజేయనున్నారు. ఈ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

నేడు పలమనేరుకు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి

పలమనేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన రెడ్డి శుక్రవారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పలమనేరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంతోపాటు అక్కడ నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పలమనేరు నుంచి రోడ్డు మార్గాన తిరుపతికి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేటినుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి చౌకదుకాణాల ద్వారా బియ్యం, చక్కెర పంపిణీని ప్రారంభిస్తున్నట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాకు 9వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 270 టన్నుల చక్కెరను కేటాయించిందని వివరించారు. 1,379 చౌకదుకాణాల ద్వారా కార్డుదారులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత బియ్యంతోపాటు నగదుపై చక్కెరను అందిస్తామని చెప్పారు.

జోరుగా తొలి అడుగు

క్షేత్రస్థాయిలో విస్తృతంగా టీడీపీ నేతల పర్యటన

● ఏడాదిలో చేసిన మంచిని వివరిస్తున్న శ్రేణులు

● కుప్పం నియోజకవర్గంలో వంద శాతం పూర్తి

నియోజకవర్గం	తిరగాల్సిన ఇళ్లు	ప్రచారం చేసినవి	శాతం
కుప్పం	87104	77612	89.10
పూతలపట్టు	72572	54657	75.31
పలమనేరు	86713	57717	66.56
పుంగనూరు	79117	46285	58.50
చిత్తూరు	69605	38733	55.65
జీడీనెల్లూరు	67200	28010	41.68
నగరి	69569	25439	36.57



చిత్తూరులో ఇటీవల జరిగిన ఇంటింటి ప్రచారంలో టీడీపీ కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, టీడీపీ నాయకులు

చిత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు..' కార్యక్రమాన్ని జిల్లాలో టీడీపీ నాయకులు జోరుగా నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పూర్తయిన సందర్భంగా ఇప్పటివరకు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్న చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అత్యధికంగా 89శాతం ప్రచారం పూర్తవగా, మిగిలిన నియోజకవర్గాల్లోనూ జోరుగా సాగుతోంది. నగరి, జీడీనెల్లూరు వెనుకబడ్డాయి.

ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించేందుకు జూలై 2వ తేదీన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.శాంతిపురం మండల పర్యటనలో చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి..ఇంటింటికి వెళ్లి తాము చేపడుతున్న సంక్షేమ పథకాలతో జరుగుతున్న మంచిని వివరించారు.వారి మంచిచెడ్డలను విచారించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తాము చేసిన మంచిని చెప్పడంతో పాటు సంక్షేమం, అభివృద్ధి అంశాల్లో ప్రభుత్వం ఎలా కట్టుబడి ఉందో ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలు ఏం ఆశిస్తున్నారో తెలుసుకుంటున్నారు. నియోజకవర్గాల్లో క్లస్టర్ నుంచి ఎమ్మెల్యే, ఇన్‌చార్జి వరకు బాధ్యత తీసుకుని ఇంటింటికి తిరుగుతున్నారు. ఏడాదిలో జరిగిన మంచిని వివరిస్తూనే ఐదేళ్లలో వైసీపీ చేసిన విధ్వంసాన్ని గుర్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, నాయకులతో పాటు కార్యకర్తలు పెద్దఎత్తున వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంతో పార్టీ శ్రేణుల్లో ఒకింత ఉత్సాహం పెరిగింది. నాయకులు ఇంటింటికీ తిరగడంతో పాటు ఆ వివరాలను నిర్దేశిత యాప్‌లో అప్లోడ్ చేయాల్సివుంది. తిరిగి కూడా అప్లోడ్ చేయకుంటే వెనుకబడినట్లే. ఉదాహరణకు అమరనాథ రెడ్డి ఇటీవల విదేశాలకు వెళ్లివచ్చినా ద్వితీయ శ్రేణి నాయకులు ఇంటింటికి తిరిగి వివరాలను అప్లోడ్ చేయడంతో పలమనేరు 3వ స్థానంలో నిలిచింది.

మంత్రులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్ ఇటీవల జీడీనెల్లూరులో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం మరో మంత్రి బీసీ జనార్దన రెడ్డి పలమనేరు నియోజకవర్గంలో పాల్గొనేందుకు వస్తున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ రోజూ తిరుగుతూ నియోజకవర్గాన్ని కుప్పం తర్వాతి స్థానంలో నిలిపారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఇటీవల విదేశాలకు వెళ్లి మంగళవారం వచ్చినా, అక్కడి నాయకులు ఈ కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తూ వచ్చారు. దీంతో ఆ నియోజకవర్గం మూడో స్థానంలో ఉంది. పుంగనూరులో టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కూడా రోజూ చిత్తూరు నగరం, రూరల్,గుడిపాల, మండలాల్లో స్థానిక నాయకులతో కలిసి తిరుగుతున్నారు. జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ వీలును బట్టి నియోజకవర్గంలో తిరుగుతున్నా, నాయకులు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలు కాస్త వెనుకబడ్డాయి. ఈ రెండు చోట్ల ఎమ్మెల్యేలు థామస్, గాలి భానుప్రకాష్ చొరవ తీసుకుని స్థానిక నాయకులకూ బాధ్యతలు అప్పగిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

వీఆర్వోను లైంగికంగా వేధించారని వాకాడు తహసీల్దార్ సస్పెన్షన్

● సోషల్ మీడియాలో తహసిల్దార్ నగ్న వీడియోలు

● వేధింపులా, బ్లాక్‌మెయిలా?



రామయ్య

నాయుడుపేట/వాకాడు, జూలై31(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఓ మహిళా వీఆర్వోను వాకాడు తహసీల్దార్ లైంగికంగా వేధించారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు జిల్లాలో సంచలనం సృష్టించాయి. వీడియోలో ఉన్న తహసిల్దార్ రామయ్యను కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేయడంతో పాటు సంఘటనపై విచారణకు ఆదేశించారు. అయితే ఈ సంఘటనపై భిన్న వాదనలు వినిపిస్తుండగా, ఇద్దరు విలేకర్ల పాత్రపై ఆరోపణలు వెలువడుతున్నాయి.

వీడియోల్లో ఏముంది?

వాకాడు తహసిల్దార్ రామయ్య నాయుడుపేటలో వుంటోన్న పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు వీఆర్వో కళ్యాణి ఇంట్లో నగ్నంగా ఉండగా ఆయనపై వీఆర్వో తల్లి చీపురుతో దాడి చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆయన ప్యాంటు తొడుక్కుని బయటకు వెళ్లే ప్రయత్నాన్ని కొందరు అడ్డుకుంటున్నట్టు వీడియోల్లో ఉంది. జూన్ 24న ఈ సంఘటన జరగ్గా, 31న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

లైంగికంగా వేధించారు: వీఆర్వో

పెళ్లకూరు మండలం తహసీల్దారుగా రామయ్య పనిచేస్తున్నప్పటి నుంచి కూడా తనను లైంగికంగా వెధిస్తున్నారని వీఆర్వో కళ్యాణి ఆరోపిస్తున్నారు. తన తల్లికి ఈ విషయం చెప్పానన్నారు. 24వ తేదీన తన ఇంటికి వచ్చి లైంగిక దాడికి దిగారని చెప్పారు. దాంతో తనకు సన్నిహితులైన ఇద్దరు విలేకర్లకు ఫోన్ చేసి పిలిపించానని తెలిపారు.

ఇదంతా బ్లాక్ మెయిల్ కుట్ర: తహసీల్దారు

తనను కుట్రపూరితంగా ఇరికించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తహసిల్దార్ రామయ్య చెబుతున్నారు. వీఆర్వో కళ్యాణి పథకం ప్రకారం తనను ఇంటికి రప్పించి ఇద్దరు విలేకరులతో కలిసి తన నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయాలని పథకం వేశారన్నారు. ఇద్దరు విలేకర్లు కోటి రూపాయలు ఇవ్వాలంటూ తనను బెదిరించడంతో బుధవారం కలెక్టర్‌కు, గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశానని తహసీల్దారు రామయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు.

తహసిల్దారు సస్పెన్షన్

వీఆర్వో కళ్యాణి చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి తహసిల్దారు రామయ్యను సస్పెండ్ చేశారు. విచారణకు సైతం ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రోజ్‌మాండ్‌ను విచారణాధికారిగా నియమించారు. కాగా గురువారం రాత్రి వాకాడు తహసిల్దారు రామయ్య చేసిన ఫిర్యాదుతో ఎస్పీ హర్షవర్ధన్ రాజు కూడా విచారణకు ఆదేశించారు. స్పెషల్ బ్రాంచి సీఐకి విచారణ బాధ్యతలు అప్పగించారు.

విలేకర్ల పాత్రపై ఆరోపణలు

ఈ సంఘటనపై విలేకర్ల పాత్ర మీద కూడా విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. 24న సంఘటన జరిగితే ఇన్ని రోజులు ఎందుకు వెలుగులోకి తీసుకురాలేదని ప్రశ్నిస్తున్నారు. డబ్బులు గుంజే ప్రయత్నం ఫలించకపోవడంతోనే వీడియోలు వైరల్ చేశారని ఆరోపిస్తున్నారు. ఇందువల్ల బాధితురాలైన వీఆర్వో ప్రతిష్టకు సైతం వారు తీవ్రంగా నష్టం కలిగించారని నెటిజన్లు మండిపడుతున్నారు. తనను కోటి రూపాయలు డిమాండ్ చేశారని తహసిల్దార్ రామయ్య ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక విలేకరి వారంలోగా రూ.35 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఆ తర్వాత నెల రోజులకు మరో రూ.35లక్షలు ఇవ్వాలన్నారని ఆయన పేర్కొన్నారు. లేకుంటే తన ప్రతిష్ట దెబ్బతినేలా వీడియోలు బయట పెడతామని బెదిరించారన్నారు. ఆ విలేకర్లే బలవంతంగా తన బట్టలు వీకేసి వీడియోలు తీశారని ఆయన పేర్కొన్నారు. భిన్న వాదనలు వినిపిస్తున్న ఈ సంఘటనపై లోతుగా దర్యాప్తు జరిపితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయి.

కలెక్టరేట్‌కు కడపగుంట వీఆర్వో సరెండర్

గంగాధరనెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు మండలం కడపగుంట రెవిన్యూ క్లస్టర్ వీఆర్వో రవిని కలెక్టరేట్‌కు సరెండర్ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కడపగుంట రెవిన్యూలో ఒకరిభూమిని మరొకరికి, అదేవిధంగా గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి వీఆర్వోగా పనిచేసిన కాలంలో అక్కడ సైతం అదేవిధంగా ఒకరి భూమిని మరొకరికి రాసిచ్చారని వీఆర్వో రవిపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వరత్తూరు పంచాయతీ దళవాయిపల్లెలో ఓ రైతుకు చెందిన భూమిని మరొకరికి రాసిచ్చేశారని ఇన్‌చార్జి వీఆర్వోగా పనిచేస్తున్న సుబ్రమణ్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆ ఇద్దరు వీఆర్వోలపై కలెక్టర్‌కు నివేదిక పూర్తిస్థాయిలో పంపించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

300 గ్రామాల్లో నేటినుంచి స్వామిత్వ సర్వే

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 40 శాతం నివాసాలకు యజమానుల వద్ద ఆస్తి పత్రాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు మూడేళ్ల కిందట స్వామిత్వ పేరుతో కేంద్ర ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. తొలి విడతగా జిల్లాలోని 88 గ్రామాల పరిధిలో సర్వే చేపట్టింది.58 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి ఆస్తి పత్రాలను వాటి యజమానులకు అందించారు. తాజాగా ఆగస్టు 1 నుంచి రెండో విడత కార్యక్రమంప్రారంభమవనుంది.ఈ కార్యక్రమ విజయవంతానికి ప్రత్యేక కమిటీలను నియమించారు. డీపీవో పర్యవేక్షణలో గ్రామ, మండల స్థాయి కమిటీలుండగా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీర్ల సహాయకులు ఉంటారు. డీపీవో కార్యాలయానికి చెందిన ఓ అధికారిని నోడల్ ఆఫీసరుగా కలెక్టర్ నియమిస్తారు. అక్టోబరు 31 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో కొత్తగా 300 గ్రామాల్లో గ్రామకంఠం భూములను సర్వే చేయనున్నారు. సర్వే అనంతరం ఇంటి యజమానికి ఆస్తి హక్కు కార్డులను అందిస్తారు. అందులో యజమాని ఆస్తితో పాటు పూర్తి వివరాలు ఉంటాయి. ప్రతి కార్డుకూ పీపీఎం పేరుతో ఆధార్ మాదిరిగా 18 అంకెల నెంబరు కేటాయిస్తారు. ప్రత్యేక క్యూ ఆర్ కోడ్ అమల్లో ఉంటుంది. దీనిపై డీపీవో సుధాకర రావు మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే కార్యక్రమానికి సంబంధించిన పనులను పూర్తి చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు.

కల్యాణి డ్యామ్ వైపు మళ్లీ ఏనుగులు

● రాగిమాకులకుంట సమీపాన వరి పంట ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని శేషాచల అటవీ ప్రాంత సరిహద్దుల్లో మూడు రోజులుగా గజరాజులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని రాగిమాకులకుంట సమీపంలో గోవర్ధన్ పొలంలో చొరబడి వరి పంటను ధ్వంసం చేశాయి. అనంతరం కల్యాణి డ్యామ్ వైపు వెళ్లాయి. దీంతో ఆప్రాంత ప్రజలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. రాగిమాకులకుంట, దుర్గం ఎస్టీ కాలనీల వైపు ఏనుగుల గుంపు రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా కాల్చారు. డప్పులు వాయించారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. రాత్రి వేళల్లో రైతులు పొలాలకు వెళ్ళకూడదని సూచించారు. ఏనుగుల ఉనికి గురించి తెలిస్తే వెంటనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.

గోకులాలకు బిల్లుల చెల్లింపులో జాప్యం

ఉసూరుమంటున్న పాడి రైతులు




పెనుమూరు మండలంలో నిర్మించిన ఓ గోకులం

చిత్తూరు సెంట్రల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు నీడ కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మినీ గోకులాల పేరుతో షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. ఉపాధి హామీ నిధులతో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఈ షెడ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 2795 మినీ గోకులం షెడ్లు నిర్మించడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఒక్కో షెడ్ నిర్మాణానికి సుమారు రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో రూ.62.93 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.పనుల్లో పురోగతి చూపేలా షెడ్ల పనులు పూర్తి కాగానే బిల్లులు చెల్లిస్తామంటూ పాడి రైతులకు అధికారులు భరోసా కల్పించారు.తీరా షెడ్లు నిర్మించుకున్నాక బిల్లులు చెల్లింపులో జాప్యం చోటు చేసుకోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు. దీంతో షెడ్ల పనుల్లో పురోగతి మందగించింది. ఏడాది కిందట మొదలైన పనులు మొదటి ఆరు నెలలు మాత్రమే వేగంగా సాగాయి.జిల్లావ్యాప్తంగా 2795 షెడ్ల నిర్మాణానికి అనుమతులు రాగా, ఇప్పటి వరకు 1554 షెడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మరో 382 షెడ్లు బేస్‌మెంట్ దశలో, 318 షెడ్లు రూఫ్ స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. 541 షెడ్ల నిర్మాణ పనులు ఇప్పటికీ మొదలు కాలేదు.బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తయిన పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చకపోవడం, పాడి రైతుల బ్యాంకు అకౌంట్ల వివరాలు సరిపోలకపోవడం, చెల్లింపుల్లో కొత్త విధానం తెరపైకి రావడం వంటి కారణాలతో షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న పాడి రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది.ఇప్పటి వరకు రూ.14.80 కోట్ల విలువైన బిల్లుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చగా, రూ.12 కోట్ల దాకా చెల్లింపులు జరిగాయి.రూ.7.23 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండగా, రూ.5.53 కోట్లకు పనులకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదు.

మొత్తం షెడ్లు	: 2795
అంచనా వ్యయం	: రూ.62.93 కోట్లు
పూర్తయిన షెడ్లు	: 1554
రూఫ్ వరకు పూర్తయినవి	: 318
బేస్‌మెంట్ పనులు	: 382
మొదలు కానివి	: 541
అన్‌లైన్‌లో పొందుపర్చినవి	: రూ.14.80 కోట్లు
అన్‌లైన్‌లో నమోదు కానివి	: రూ.5.53 కోట్లు
పెండింగ్ నిధులు	: రూ.7.23 కోట్లు

రూ.40 కోట్లఆమోదానికి నివేదించాం



మినీ గోకులాలకు సంబంధించి పూర్తి చేసిన షెడ్లకు రూ.14.80 కోట్లు రాగా, రూ.12 కోట్లు మూడు విడతల్లో చెల్లించాం.తరువాత పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.40 కోట్ల ఆమోదానికి ప్రభుత్వానికి నివేదించాం.రైతుల బ్యాంకు, ఇతర వివరాల నమోదులో ఆన్‌లైన్ సమస్యలున్నాయి. మరో వైపు ప్రభుత్వం బిల్లుల ఆమోదానికి కొత్త విధానం అమలు చేస్తున్న క్రమంలో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. అయినప్పటికీ త్వరలో నిధులు మంజూరయ్యే వీలుంది.రాగానే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తాం. పాడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- రవికుమార్, డ్వామా పీడీ







తిరుమల.. పచ్చని సోయగాల మాల

ఇల వైకుంఠంగా భక్తులు భావించే తిరుమల గిరులు పచ్చదనంతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు చెట్లన్నీ చిగురించి ఈ ఆధ్యాత్మిక ప్రాంతానికి కొత్త వన్నెలద్దాయి. భక్తులను ఆహ్లాదంతో పులకరింపజేస్తున్నాయి. గుండెనిండా భక్తి నింపుకొని ఏడుకొండలను చేరుకుంటున్న వారు హరితకాంతలా మారిన తిరుమల కొండలను చూసి తన్మయత్వం చెందుతున్నారు. ప్రకృతి ప్రియులు ఈ నయనమనోహర అందాలను ఆస్వాదిస్తూ తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. శేషాచలంతో పాటు సమీపంలోని ఎస్వీ యూనివర్సిటీ లాంటి ప్రాంతాలు కూడా పచ్చదనాన్ని పరుచుకుని కనువిందు చేస్తున్నాయి.

మెరిసిన మన ఆణిముత్యాలు

● తడుకు విద్యార్థుల 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి

తిరుపతి(విద్య), జూలై 31(ఆంధ్రజ్యోతి): మన జిల్లా విద్యార్థులు ఢిల్లీలో మెరిశారు. మన విజ్ఞాన వీచికలు జాతీయ స్థాయి వేదికలపై జిల్లా పేరును మార్మోగించాయి. మన జిల్లా విద్యార్థులు రూపొందించిన నమూనా ఏకంగా పేటెంట్ హక్కు గడప తొక్కనుంది. వడమాలపేట మండలం తడుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్' సైన్స్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకుని రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గ నిర్దేశంలో తడుకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ సోలార్‌తో పనిచేసే 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'ను రూపొందించారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కుగాను 2024 జూలైలో పోటీలు నిర్వహించగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1,00,400 ప్రాజెక్టులు పోటీలో నిలిచాయి. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టుల స్క్రీనింగ్ ఐదు దశల్లో వడపోయగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వాటిలో రాష్ట్రం నుంచి రెండు ఎంపికకాగా అందులో




సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ - ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

తడుకు విద్యార్థుల ప్రాజెక్టు ఒకటి. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గాల్గొటీ యూనివర్శిటీలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శన-వర్క్‌షాప్-2025 జరిగింది. ఈ ప్రదర్శనకు జిల్లా విద్యార్థుల సైన్స్ ప్రాజెక్ట్‌తోపాటు మొత్తం 39 ప్రాజెక్టులు పోటీపడ్డాయి. వీటిలో సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసీటీయూ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇళంగోవన్ కరియప్పన్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌ను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. మినీ ఫాస్ట్ కంపోస్టర్‌కు పేటెంట్ హక్కు పొందేందుకు ప్రతిపాదిస్తామని ప్రకటించారు. కాగా, మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.90,500 ప్రకటించింది.

పరికరం.. ఎంతో ఉపయుక్తం

మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరం ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఇది సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. బాక్టీరియా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడానికి కావాల్సిన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ విధానంలో కీటకాలు అభివృద్ధి చెందకుండా కూడా ఈ విధానం పనిచేస్తుంది. ప్రస్తుతం గృహావసరాలకు సరిపడేలా రూపొందించిన ఈ పరికరాన్ని పెద్దఎత్తున వ్యాపార అవసరాలకు వినియోగించేలా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో అభివృద్ధి చేయనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.99 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,303
తలనీలాలు సమర్పించినవారు: 27,166

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌పీవోలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల(ఎఫ్‌పీవో) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పనిచేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా చిరుధాన్యాల సాగుపైనా దృష్టి సారించాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. ఆయిల్‌పాం, ఆక్వా రంగంలోనూ మంచి రాబడులు వస్తున్నాయని వివరించారు. అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తీసుకువచ్చే నూతన వ్యవసాయ మార్పులపై సుదీర్ఘంగా వివరించారు. రైతులకు ఉపయోగపడే సమాచారంతో వచ్చిన ఏపీఏఐఎంఎస్ సరికొత్త మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో పరిశోధనలపై దృష్టి సారించండి



ఐసర్‌లో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు

● ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనలతో పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించి రసాయన పద్ధతులు సాంకేతికతల వంటి అంశాలపై చర్చించాలని ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య సూచించారు. ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న ఐసర్ ప్రాంగణంలో జూలై 29, 30వ తేదీల్లో జాతీయ సదస్సు జరిగిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండర్ రీసెర్చ్(ఐసర్) తిరుపతి రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సస్టైనబిలిటీ కోసం రసాయన శాస్త్రం అనే జాతీయ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సుస్థిర రసాయన పద్ధతులపై కొత్త పరిశోధనలు, ఆలోచనలు పంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 18 ప్రత్యేక ఉపన్యాసాలు జరిగాయి. వీటిలో పదార్థ శాస్త్రం, ఎలక్ట్రో కెమెస్ట్రీ, పచ్చ రసాయన పద్ధతులు, శక్తి నిల్వ సాంకేతికతల వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో 300 మందికి పైగా పీజీ విద్యార్థులు, పరిశోధకులు, పోస్ట్ డాక్టరల్ ఫెలోస్ ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్త కావాలి : కలెక్టర్

● పొదుపు సంఘాల్లో అవకతవకలు నివారించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మహిళా పొదుపు సంఘాల్లో అవకతవకలు జరగకుండా ఖాతా పుస్తకాలు ఎప్పటికప్పుడు రాయించాలని ఆదేశించారు. గురువారం తిరుపతిలోని ఓ హోటల్లో ఎంటర్‌ప్రెన్యూర్స్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి సంఘంలోని సభ్యులు జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, దాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. గ్రూపుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

రేణిగుంట, జూలై 31(ఆంధ్రజ్యోతి):చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండగా పోలీసులు రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక టాక్టర్‌ను సీజ్ చేశారు. స్టేషన్ రైటర్ చలపతి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి మండలంలోని వేదాలచెరువు గ్రామంలోని చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులను చూసి కొంతమంది పారిపోయారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1,200 ఓటర్లు దాటిన తర్వాత అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఆర్వో నరసింహులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో గురువారం పోలింగ్ కేంద్రాల సరళీకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 33 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేర్లు మార్పు కోసం 8 కేంద్రాలను గుర్తించామని తెలిపారు. 1,200 మంది ఓటర్లు దాటిన 162 కేంద్రాలను గుర్తించామన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.

రాష్ట్రంలో అలజడికి సృష్టించడానికి జగన్ వ్యూహం

● వైసీపీ యాప్ తెస్తే ఆవేదన చెప్పడానికి సిద్ధంగా మద్యం బాధితులున్నారన్న శాప్ ఛైర్మన్



తిరుపతి(జీవకోన), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడిప్పుడే రాష్ట్రం గాడిన పడుతుంటే.. అలజడి సృష్టించడానికి వైసీపీ అధినేత జగన్ వ్యూహం పన్నారని శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఆరోపించారు. నెల్లూరు పర్యటనలోనూ కార్యకర్తలను రెచ్చగొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ, అధికారులను భయపెట్టేందుకు యాప్ తెస్తానంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. యాప్ తెస్తే వైసీపీ ప్రభుత్వంలో మద్యం ద్వారా ఛిన్నాభిన్నమైన 30 వేల కుటుంబాలతో పాటు బాధితులెందరో తమ ఆవేదన చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యం నాలుగు పాదాలపై నడిచిందని మంత్రి రోజా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే ఎగరేసి తంతామంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఎగిరెగిరి మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోమని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఎప్పుడైనా మహిళలా రోజా ప్రవర్తించారా అని ఆయన ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని, త్వరలోనే మరో కుంభకోణం కూడా బయటకు వస్తుందని చెప్పారు. ఓ మంత్రి రోజాను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ మీడియా వారు ప్రశ్నించగా అలాంటి వాటికి అవకాశం ఉండదని ఈ శాఖలో తాను ఉన్నానంటూ చెప్పుకొచ్చారు.

సెల్‌ఫోన్ దొంగిలించారంటూ దాడి

● అవమానం భరించలేక మహిళ ఆత్మహత్య ● ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



ప్రసన్న (ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో సెల్‌ఫోన్ దొంగలించారంటూ పక్కింటి మహిళపై అనుమానం పెట్టుకున్నారు. తరచూ వేధించారు. నానా మాటలన్నారు. చివరకు దాడి చేశారు. ఆ అవమానం భరించలేక ప్రసన్న (30) ఆత్మహత్య చేసుకుంది. ఏర్పేడు మండలం మన్నసముద్రంలో 25 రోజుల కిందటి ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన ప్రకారం.. మన్నసముద్రంకు చెందిన గోడల కృష్ణయ్య, నారాయణమ్మ దంపతుల కుమార్తె ప్రసన్నకు, దొరవారి సత్రం మండలానికి చెందిన పోలయ్యకు వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ప్రసన్న తన పుట్టింటికి వచ్చారు. జూన్ 30న గంగమ్మ ఇంట్లో సెల్‌ఫోను కనిపించకుండా పోయింది. ఆమె ప్రసన్నపై అనుమానం పెట్టుకుని తిట్టేది. ఈ క్రమంలో జూలై 2న గంగమ్మ కుటుంబీకులు దాడి చేయగా, ప్రసన్న తీవ్రంగా గాయపడ్డారు. దాడి, దొంగతనం నెపం వేశారనే బాధ భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబీకులు తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 5న మృతి చెందారు. తమ కుమార్తెను అవమానించి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కృష్ణయ్య జూలై 10వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించిన పోలీసులు గంగమ్మతో పాటు ఆమె కుటుంబానికి చెందిన సుబ్రహ్మణ్యం, గురవయ్య, గంగమ్మ, శైలజ, పాపమ్మ, చిట్టెమ్మ, మణెమ్మపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే కేసు నమోదు

తమ కుమార్తె ప్రసన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన 15 రోజుల వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని కృష్ణయ్య అంటున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిశామన్నారు. ఆయన చొరవతోనే కేసు నమోదైందని అంటున్నారు. కాగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి స్వగ్రామంలో.. తమ ఇంటి పక్కన ప్రసన్న ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాన్ని ఇప్పటి వరకు ఎంపీ పరామర్శించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు.

12న బీజేపీ 'సారథ్యం'

● రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లాకు రానున్న మాధవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'సారథ్యం' కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగస్టు12న తిరుపతి నగరం, జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి నగరం రాఘవేంద్రనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ఆధునికీకరించి.. గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామంచి మాట్లాడుతూ.. సారథ్యం కార్యక్రమం ఉదయం ఆర్ఎస్ఎస్ శాఖతో ప్రారంభమవై.. స్థానిక ప్రజలతో చాయ్‌పే చర్చ ఉంటుందని చెప్పారు. తర్వాత బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా కచ్చపి ఆడిటోరియంకు చేరుకుంటారని, కార్యకర్తలతో విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. సాయంత్రం జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సమావేశమవుతారన్నారు. ఈ సందర్భంగా మాధవ్ పర్యటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

టీటీడీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ ఉమ, చంద్రారెడ్డి, ఎస్ఎస్ఆర్ నాయుడు, కోటేశ్వరరావు, నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, డాక్టర్ నరేష్‌బాబు, సత్యవేడు మునిక్రిష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అనూష రామకృష్ణ, నరేంద్రరెడ్డి, మల్లకుప్పం శేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు ట్రోఫీల బహూకరణ

తిరుపతి(క్రీడలు), జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీల విజేతలకు గురువారం ట్రోఫీలు బహూకరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసి, అభినందించారు. ఇక్కడ విజయం సాధించిన వారు డిసెంబర్‌లో విజయవాడలో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్‌ను చిత్తూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.



ట్రోఫీలతో బ్యాడ్మింటన్ పోటీల విన్నర్స్, రన్నర్స్

విజేతల వివరాలిలా...

● **మిక్స్‌డ్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.నవ్య(చిత్తూరు)లపై హేమచంద్రన్‌సెల్వం, కవిప్రియసెల్వం(విశాఖపట్నం) విజయం

● **ఉమెన్ డబుల్స్** : ఎ.హర్షిక, ఎ.ప్రవల్లికమణి(విశాఖపట్నం)లపై డి.దీపిక, డి.స్రవంతి(గుంటూరు) గెలుపు

● **మెన్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.విష్ణుకేదార్(ప్రకాశం)లపై ఎ.భార్గవరామ్(గుంటూరు), జి.వి శ్వతేజ్(కడప) విజయం. ● **ఉమెన్ సింగిల్స్** : ఎం.తనిష్క(గుంటూరు)పై కె.నవ్య(చిత్తూరు) గెలుపు. ● **మెన్ సింగిల్స్** : టి.అనిష్‌డేనియల్(నెల్లూరు)పై కె.మోహిత్(తూర్పుగోదావరి)విజయం.

10మంది ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ. 6 లక్షల వంతున జరిమానా

తిరుపతి(నేరవిభాగం),జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 10 మంది ముద్దాయిలకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. వివరాలిలా...2019లో పెరుమాళ్ల పల్లి బీటు పరిధిలోని ఎస్వీఎన్‌పీ డివిజన్‌లో తమిళనాడులోని తిరువన్నామలై, వేలూరు జిల్లాలకు చెందిన సి.విశ్వనాథ్, డి.సేతు, డి.రమేష్, ఎం.సంపత్, వి.రత్నం, బూచాయాన్, జె.కుమార్, సి.ప్రభు, సురేష్, సి.రామర్‌లు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆరేళ్ళ పాటు కేసు విచారణ దశలో ఉన్న ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 10 మంది స్మగ్లర్లకు ఐదేళ్ళు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో అధికారులు కఠిన శిక్షపడేలా సాక్ష్యాధారాలను నిరూపించడంలో సఫలీకృతులయ్యారు.

డ్రగ్స్ నివారణకు సహకరించండి

- ఈగల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ -

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణకు అందరూ సహకరించాలని పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ లా, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ఈగల్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, కలిగి ఉన్నా, వాడినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్ గురించి 1972 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఎవరైనా సమాచారం అందించవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్వీయూ పీఎస్ ఎస్ఐ కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వారాంతపు లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతంగా చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల హౌసింగ్ పురోగతిపై డీఈలు, ఏఈలు, పీఆర్ ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాలను రోజూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. డీఈలు రాఘవయ్య, యోగమత్యనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరుపేద రైతులకు రుణాలిచ్చి ఆదుకోండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుపేద రైతులకు కోరిన మేరకు తక్కువ వడ్డీతో రుణాలను ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పైవిధంగా అన్నారు.



కలెక్టర్‌ను సన్మానించిన అమాస రాజశేఖరరెడ్డి

'అన్నదాత సుఖీభవ'కు ఏర్పాట్లు చేయండి

● అధికారులకు కలెక్టర్ సూచన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత నగదు శనివారం నుంచి రైతుల ఖాతాల్లో జమ కానుంది. అన్ని సచివాలయ స్థాయిల్లో ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేయండి' అని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అంతకుముందు అన్నదాత సుఖీభవ ఇతర అంశాలపై సీఎం చంద్రబాబు అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం జేసీ విద్యాధరి, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ తదితరులతో కలెక్టరేట్ మీటింగ్ హాలు నుంచి ఏవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఈ పథకం కింద 211628 మంది రైతులు అర్హుత కల్గి ఉన్నారన్నారు. గురువారం వరకు 204971 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని చెప్పారు. 6644 మంది ఈకేవైసీ రిజెక్టవగా, మరో 13 మందివి పెండింగ్‌లో ఉందన్నారు. అర్హులైన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో తెలంగాణ యువకుడి మృతి

శ్రీరంగరాజపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన కొండల్ గౌడ్(35) పాలసముద్రం మండలంలోని హట్సన్ డెయిరీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఎస్ఆర్‌పురం మండలం అంకనపల్లె పాల సెంటర్ తనిఖీ చేయడానికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అంకనపల్లె సమీపంలో ఓ చింత చెట్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆపి, అదుపుతప్పి పక్కనున్న బావిలో పడిపోయాడు. బావిలో ఎవరో చనిపోయి ఉన్నారన్న స్థానికుల సమాచారంతో గురువారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలుపలకు తీసి పోస్టుమార్టు నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు.



కొండల్ గౌడ్ మృతదేహం

'తల్లికి వందనం' నగదు అందలేదు

బాధితురాలి ఆవేదన

విజయపురం,జూలై31(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం నగదు తనకు అందలేదని విజయపురం మండలంలోని ఇష్టకామేశపురం గొల్లకండ్రిగకు చెందిన మంజుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. బూచివానత్తం సచివాలయ పరిధిలోని గొల్లకండ్రిగకు చెందిన మంజుల కుమార్తె ఇ.తనుశ్రీ నగరి వద్ద కీలపట్టులోని రామ్మూర్తి విద్యాలయలో ఆరో తరగతి చదువుతోంది. తల్లికి వందనం పథకానికి అర్హత సాధించినా ఇప్పటికీ తన బ్యాంకు ఖాతాలో డబ్బులు పడలేదని హెచ్‌ఎంను అడిగారు. తాము వివరాలు సరిగ్గానే పంపామని, సచివాలయానికి వెళ్లి తెలుసుకోవాలని హెచ్ఎం సూచించారు. ఆమె సచివాలయం వద్దకెళితే మీ కుమార్తెకు నగదు మంజూరైందని, అయితే వి.కళావతి పేరిట నగరి కోఆపరేటివ్ బ్యాంకులో జమైందని అక్కడి సిబ్బంది తెలిపారు. బ్యాంకుకు వెళితే ఇక్కడ మీకు బ్యాంకు ఖాతానే లేనప్పుడు తామేమీ చేయలేమని చెప్పారని మంజుల వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు కల్పించుకుని న్యాయం చేయాలని కోరారు.



కుమార్తెతో మంజుల

పుత్తూరు సీఐగా శేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

పుత్తూరు అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సీఐగా కె.ఆర్.శేఖర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలికిరి స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ రవికుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎస్వీయూలో ఏడుగురు ఏఏఓలకు పదోన్నతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఏడుగురు అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఏఓ)లకు అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఏఆర్)లుగా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జితేంద్రనాయక్, మహమ్మద్‌షఫీ, కవిత, వెంకటరమణ, విజయకుమార్, సురేష్‌కుమార్, లోకనాథం ఉన్నారు. ఈ సందర్భంగా వారు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.







ఫిర్యాదు చేసేందుకు ఇటీవల కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత రైతులు - ఎక్స్‌కవేటర్‌తో రైతుల పొలాల్ని చదును చేస్తూ - చదును చేశాక పరిస్థితి..

గుడి పేరుతో ఆక్రమణ

● రైతుల్ని ఇబ్బంది పెడుతున్న బెంగళూరువాసి
● వైసీపీ హయాంలో ఆక్రమించుకుని ఫెన్సింగ్
● భూమి రైతులదేనని నిర్ధారించిన రెవెన్యూ శాఖ



అధికారులు రైతుల పొలాల్లో నాటిన హెచ్చరిక బోర్డులను తీసి పడేసి..

చిత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):గంగాధర నెల్లూరు మండలంలో గుడి పేరుతో రైతుల భూముల్ని ఆక్రమించుకోవడంపై వివాదం పెద్దదవుతోంది. ఎస్ఆర్ పురంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నాం, పెద్దఎత్తున నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అప్పట్లో హడావిడి చేశారు. దీపక్‌కుమార్ అనే బెంగళూరువాసిని ఇక్కడికి తీసుకొచ్చి ఎస్ఆర్‌పురంలో ఓ భవనాన్నీ నిర్మించారు. ఆ దీపక్‌కుమారే జీడీనెల్లూరు మండలం అగరమంగళం వద్ద సుమారు 30 ఎకరాల్లో అంకాల పరమేశ్వరి గుడిని నిర్మించారు. ఆ ప్రాంగణంలోనే గెస్ట్‌హౌసుల్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. 24 ఎకరాల భూమిని రైతుల నుంచి కొని రిజిస్ట్రేషన్ చేసుకోగా.. అగరమంగళం, వీరకనెల్లూరు గ్రామాలకు చెందిన ఆరుగురు రైతులు తమ 6.5 ఎకరాల్ని అమ్మేందుకు ఒప్పుకోలేదు. దీంతో విజయానందరెడ్డి అండతో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 6.5 ఎకరాల్ని ఆక్రమించుకున్న దీపక్‌కుమార్ ఫెన్సింగ్ వేసుకున్నారు.

ప్రభుత్వం మారాక మొదలైన రైతుల పోరాటం

కూటమి ప్రభుత్వం వచ్చాక అగరమంగళం, వీరకనెల్లూరు గ్రామాలకు చెందిన రైతులు శంకర్ బోయెడు, ఆనందబాబు, చిట్టెమ్మ, బీష్మయ్య బోయెడు, పార్వతి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు తమ భూములను తమకు ఇప్పించమంటూ ఫిర్యాదు చేశారు. ఆర్డీవో విచారణలో ఆ 6.5 ఎకరాల భూమి రైతులదేనని తేలింది. కలెక్టర్ ఆదేశాలతో నాలుగు నెలల కిందట జిల్లా సర్వేయర్ అక్కడికి వెళ్లి సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. రైతు పేరు, విస్తీర్ణంతో కూడిన సూచన బోర్డుల్ని ఏర్పాటుచేశారు. దీంతో రైతులు తమ భూముల్లో కొబ్బరి చెట్లను సాగు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఈ భూమి మీది కాదని, ఫెన్సింగ్ తీసేయాలని జీడీనెల్లూరు తహసీల్దార్ ఏప్రిల్‌లో దీపక్‌కు నోటీసులిచ్చారు.అయితే ఆ నోటీసుల్ని సస్పెండ్ చేస్తూ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్న దీపక్ తన మనుషులతో 6.5 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రైతులు సాగు చేసుకున్న కొబ్బరి చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తవ్వేశారు.

రైతులపై దాడి చేసిన ఆక్రమణదారులు

తమ భూమిని దక్కించుకునే క్రమంలో ఈనెల 21వ తేదీన బాధిత రైతులు కలెక్టరేట్‌కు వచ్చి మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో 24వ తేదీ రాత్రి దీపక్ మనుషులు రైతుల మీద దాడి చేసి గాయపరిచారు. వారంతా చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్.. ఎస్సీ రైతుల భూముల్ని ఆక్రమించుకున్న వారిపై, దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ 25వ తేదీన ఎస్పీ మణికంఠకు రైతుల ఫిర్యాదును పంపించారు.సోమవారం వరకు కూడా ఆక్రమణదారులపై, దాడి చేసిన నిందితులపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు.

పూజారిని కిడ్నాప్ చేసి..

రైతుల భూముల్ని ఆక్రమించుకున్న దీపక్, అతని అనుచరుడి మీద 2024 మే నెలలో గుడి పూజారిని కిడ్నాప్ చేసిన కేసు జీడీనెల్లూరు పోలీస్‌స్టేషనులో నమోదైంది. 'గుడి నిర్మించి నన్నే కమిటీ మెంబర్‌గా పెట్టుకున్నా'నని చెప్పి తొలగించారని పూజారి.. అధికారులకు ఫిర్యాదులు చేసేవారు. దీంతో పూజారిని కిడ్నాప్ చేసి తమిళనాడుకు తీసుకెళ్లారు. తప్పించుకుని తిరుపతిలో చికిత్స పొందిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దీపక్, అతని అనుచరుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.

అది రైతుల భూమే

అగరమంగళం, వీరకనెల్లూరు గ్రామాలకు చెందిన ఆరుగురు రైతుల ఫిర్యాదు మేరకు వారి 6.5 ఎకరాల గురించి విచారించి, సర్వే చేశాం. అది ఆ రైతుల భూమేనని నిర్ధారించాం. అక్కడ గుడిని నిర్మించినవారు ఆక్రమించుకున్నారు. ఆక్రమణదారుల వద్ద ఎలాంటి రికార్డులు లేవు. ఈ అంశం కలెక్టర్ దృష్టిలో ఉంది.

- శ్రీనివాసులు, తహసీల్దార్

ఏసీబీ కేసులో సీఐ వెంకటప్పపై చర్యల నిలిపివేత

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తిరుపతి డీసీఆర్‌బీ సీఐ కుటాల వెంకటప్పపై ప్రభుత్వం తదుపరి చర్యలు నిలిపివేసింది. వివరాలిలా వున్నాయి. ఐదేళ్ల కిందట తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సీఐగా పనిచేస్తున్న ఆయనపై అవినీతికి పాల్పడడం ద్వారా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగివున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో 2020 మార్చి 11న వెంకటప్పపై కేసు నమోదు చేసిన తిరుపతి ఏసీబీ అధికారులు అదే రోజున నెల్లూరు స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండు విధించడంతో ఆ రోజే సీఐ వెంకటప్పను అనంతపురం డీఐజీ సస్పెండ్ చేశారు. మరోవైపు వెంకటప్పకు చెందిన రూ.1.88 కోట్ల విలువైన స్థిరచరాస్తులను ఏసీబీ అధికారులు కోర్టుకు అటాచ్ చేశారు. రెండేళ్ల తర్వాత 2022 జూన్ 23న ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసింది. ఈ ఏడాది జూన్ 16న ఏసీబీ డైరెక్టర్ జనరల్ సమర్పించిన తుది నివేదికలో వెంకటప్పకు ఆదాయానికి మించి రూ.58.52 లక్షల విలువైన ఆస్తులు మాత్రమే కలిగి వున్నట్టు నిర్ధారించారు. ఆదాయానికి మించి 15.45 శాతం మాత్రమే ఆస్తులు అధికంగా వున్నందున నిబంధనల రీత్యా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం లేదని, అందువల్ల తదుపరి చర్యలు నిలిపివేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో సీఐ కుటాల వెంకటప్పపై తదుపరి చర్యలను నిలిపివేయడంతో పాటు ఆయన సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీలో ఉన్నట్టుగా పరిగణిస్తున్నట్టు రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీఐ వెంకటప్ప ప్రస్తుతం తిరుపతి డీసీఆర్‌బీలో పనిచేస్తున్నారు.

మణీంద్రం ఎంపీటీసీ ఎన్నికలకు మూడు నామినేషన్లు



టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్ వేస్తున్న అరుణ, విశాలాక్షి - వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న అర్పిత

రామకుప్పం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికకు గురువారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా టీడీపీ పార్లమెంటరీ నియోజవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి భార్య అరుణ, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు శ్రీరాములురెడ్డి భార్య విశాలాక్షి నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా ఆ పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె అర్పిత నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్‌కు అందించారు.నామినేషన్ల దాఖలు సందర్భంగా రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై వెంకట మోహన్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

8న సామూహిక వరలక్ష్మీవ్రతం

శ్రీకాళహస్తి, జూలై31(ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తీశ్వరాలయం ఆవరణంలోని బ్రహ్మగుడి వద్ద 8వ తేదీ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి ఈ వ్రతం జరుగుతుందని చెప్పారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలోపాల్గొని అమ్మవారికృపకు పాత్రులు కావాలని కోరారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

10 నుంచి రేణిగుంట గంగ జాతర

రేణిగుంట జూలై 31(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ వంశపారంపర ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం గంగమ్మ ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన జాతరకు చాటింపు, 10న 108 కలశాలతో అమ్మవారికి పాలాభిషేకం, 11న పట్టణ పురవీధుల్లో గెరిగ ఊరేగింపు, 12న అమ్మవారికి విశేష అలంకరణలు, పొంగళ్లు, అంబలి సమర్పణ, 13న నడివీధి గంగమ్మ ప్రతిష్ఠ, విశ్వరూప దర్శనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, రావణ, లక్ష్మీరెడ్డి, సూరి, భాస్కర్, రేణుకుమార్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు పోలీసు స్టేషన్లకు అనుసంధానం

● వీడియో కాన్ఫరెన్సులో బ్యాంకర్లకు ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి జిల్లాలోని అన్ని జాతీయ, ప్రైవేటు బ్యాంకుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు, అలారాలు ఏర్పాటు చేసుకోవాలి. బ్యాంకుల వద్దనున్న సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్లకు అనుసంధానం చేయాలి. దీనివల్ల రాత్రి సమయాల్లో స్టేషన్ల నుంచి ప్రత్యేక నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుంది' అని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని బ్యాంకర్లు, డీఎస్పీలు, సీఐలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. హిందూపురంలో బ్యాంకు దోపిడీ జరిగిన నేపథ్యంలో ముందస్తు చర్యలపై బ్యాంకర్లు, పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బ్యాంకుల్లోని సీసీ కెమెరాల పనితీరు, రికార్డు అవుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల్లో ఎన్ని నెలల పాటు బ్యాకప్ వుంటుందని అడిగారు. క్వాలిటీ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో సెక్యూరిటీ ఎంతమంది ఉంటారు? వారి విధులేంటనే వివరాలు తమకు ఇవ్వాలని బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొన్ని ఏటీఎంల వద్దనున్న సాంకేతిక సమస్యలను పరిశీలించి పునరుద్ధరించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం బ్యాంకు డ్యూటీకి వచ్చినప్పుడు చెక్ లిస్టు ఏర్పాటు చేసుకోవాలని.. క్లోజ్ చేసి వెళ్లేముందు అన్నీ జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు.



బ్యాంకర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్న ఎస్పీ

చంద్రబాబుతోనే ఏపీకి మహర్దశ

● ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ చైర్మన్, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ఏపీకి మహర్దశ చేకూరుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు రైతులకు సహకారం అందించాలని కోరారు. జిల్లా మార్కెటింగ్ ఏడీ సురేంద్ర ఆధ్వర్యంలో పుత్తూరు మార్కెట్ యార్డు పాలక వర్గం చైర్మన్‌గా డి.ఎస్.గణేష్, వైస్ చైర్మన్‌గా లీలావతి, డైరెక్టర్లుగా బాబునాయుడు, రమేష్, మహేష్, సుజాత, దామోదరం, గోపాల్, అమరనాథ్, ఉమాశంకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్ మాట్లాడుతూ పుత్తూరు మార్కెట్ కమిటీకి కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తి ఉన్నా వచ్చే ఆదాయం జీతభత్యాలకే సరిపోతుందని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని మార్కెట్ కమిటీ స్థలంలో రైతుబజార్లు, వారపు సంతలు, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేసి కమిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, నాయకులు జీవరత్నం నాయుడు, ధనపాల్, బాలాజీ, యుగంధర్, కరుణాకర్, ఆనంద్, ప్రతాప్‌రాజు, చెంచయ్య, జానా వెంకటయ్య, ఉమాపతి, హేమాద్రి, దశరథవాసు, కరుణాయాదవ్, మోహన్‌రాజు, తులసి, డీఎన్ ఏలుమలై, భాస్కరరెడ్డి, శ్రీరామ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు ముగిసిన శిక్షణ



హెచ్‌ఎంలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ అంశంపై ఈనెల 28వ తేదీన మొదలైన శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. స్థానిక దుర్గానగర్ కాలనీలోని సీఎంఎస్ఎస్ఎస్‌లో ముగింపు సమావేశంలో పాల్గొన్న సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలపై పలు సూచనలు చేశారు. సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

టీచర్లకు బకాయిల చెల్లింపులపై రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఫ్యాప్టో



ఐక్యతను చాటుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చిత్తూరు సెంట్రల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపులు కోరుతూ శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో నిర్ణయించింది. రాష్ట్ర నాయకత్వం పిలుపుతో జిల్లా నాయకులు గురువారం స్థానిక ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిగండన్, మునీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. బోధనను హరించే యాప్‌లు పూర్తి రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాని డిమాండ్ చేశారు. వీటితోపాటు పీ-4 కార్యక్రమంపై టీచర్లను నిర్బంధం చేయరాదని, నూతనంగా అప్‌గ్రేడ్ స్థానాలను కోరుకున్నవారి జీతాలు చెల్లింపు, ఏకీకృత సర్వీసు రూల్స్ అసంబద్ధత జీవోల తొలగింపు వంటి 18 రకాలైన డిమాండ్‌లు పరిష్కారం కోరుతూ ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, ముక్తార్, రామచంద్రయ్య, గంటా మోహన్, జీవీ రమణ, సమీర్, శేఖర్, రంగనాథం, గణపతి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు దన్నుగా ఇ-సైకిళ్లు



కుప్పంలో ఈ సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న ఎలక్ట్రిక్ సైకిళ్లు చిరు వ్యాపారులకు దన్నుగా ఉంటున్నాయని, వారి వ్యాపారాభివృద్ధికి ఎంతో వినియోగ పడుతున్నాయని తెలుగుదేశం పార్టీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. కుప్పం పట్టణంలోని వెలుగు కార్యాలయం ఆవరణలో గురువారం మహిళా స్వయం సహాయక సంఘాలలోని చిరు వ్యాపారులైన మహిళలకు 20 ఈ సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.42 వేలు విలువ చేసే సైకిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం రూ.9,450 లకే మహిళలకు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. మొదటి విడతలో వందల మందికి ఈ సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, మండల సమాఖ్య సీసీలు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వసంతమ్మ, వళ్లియప్ప, అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.

సకల వర్గాలకు సమన్యాయమే సీఎం లక్ష్యం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సకల వర్గాలకు, కులాలకు, మతాలకు సమన్యాయం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని వల్లార్లపల్లెలో బలిజ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి గురువారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బలిజ సామాజిక వర్గానికి కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా దానిచుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.30 లక్షలను ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు చెప్పారు. బలిజ కమ్యూనిటీ భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు కేటాయించి ఆ పనులు పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలోనే అవసరమైన నిధులు చేస్తారని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సమాజిక వర్గానికీ న్యాయం జరగలేదని విమర్శించారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, బలిజ సామానిక వర్గానికి చెందిన నాయకులు పి.గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కూటమి నాయకులతో మాట్లాడుతున్న చల్లా బాబు

రొంపిచెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలు గుర్తించి కూటమి ప్రభుత్వ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నా రు. గురువారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు చల్లాను మర్యాద పూర్వంగా కలిశారు. మండలాల వారీగా ఆ పార్టీ అధ్యక్షులు పలు సమస్యలు చల్లా బాబు దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో బీజేపీ నాయకులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు మాదాల లోకేష్, రొంపిచెర్ల, పుంగనూరు, చౌడేపల్లి, పులిచెర్ల బీజేపీ మండలాధ్యక్షులు నాగరాజ, జగదీశ్‌రాజు, కడియాల మనోజ్, మొబీనా, సెక్రటరీలు వెంకట్రమణ నాయుడు, బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు మల్లికారాణి పాల్గొన్నారు.

సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈవో -2 పోస్టులను కేటాయించాలి

కుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్వహణ, విద్యావిషయాలపై అపారమైన అనుభవం ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల సీనియర్ ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి-2 పోస్టులు ఇవ్వాలని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఫోరం కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీయూ జిల్లా అసోసియేట్ సభ్యుడు పోతుగుంట గురవయ్యానాయుడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అలా కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే జూనియర్లను, స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవో -2 పోస్టుల్లో నియమించడం అన్యాయమని విమర్శించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల సీనియర్ ప్రధానోపాధ్యాయులను నియమించి న్యాయం చేయాలని కోరారు.

స్మార్టుమీటర్ల ఏర్పాటు వద్దు

పలమనేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్మార్టుమీటర్లను ప్రభు త్వం వెంటనే రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు డిమాండు చేశారు. గురువారం పలమనేరు మున్సిపాలిటీలోని నీళ్లకుంట గ్రామంలో స్మార్టుమీటర్లు రద్దుచేయాలని డిమాండు చేస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారీస్థాయిలో భారం మోపడానికి స్మార్టుమీటర్లు పెడుతోందన్నారు. దీన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు గిరిధరగుప్తా, పట్టణ నాయకులు రాజా, జయంతి, హైదర్‌వలీ, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

పలమనేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ లో డిప్లమో ప్రవేశాల కోసం ఆగస్టు 5న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ సావిత్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పాలిసెట్-2025 రాసి సీటు పొందని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ప్రవేశం పొందడానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు అన్ని ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికేట్లతో సంప్రదించాలని కోరారు.

వైభవంగా బాలమురుగన్ ఆలయ కుంభాభిషేక మహోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, జూలై 31 (ఆంధజ్యోతి): రామకుప్పం మండలం పాల రేవుగడ్డ బాలమురుగన్ ఆలయం కుంభాభిషేక మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటలకు పురోహితులు వివిధ హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయగోపురం పై నూతన కలశ స్థాపన చేశారు. ఉదయం 11 గంటలకు వినాయకుడు, గురుదక్షిణామూర్తి, పార్వతీదేవి, నవగ్రహాలు, వళ్లీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్, కుప్పం మాజీ జడ్పీటీసీ రాజ్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగు రైతు నియోజికవర్గ అధ్యక్షులు చలపతి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్, నేతలు గంట్లప్ప గౌడు, శ్రీనివాసులు రెడ్డి, అవినాష్, కామరాజు నాయక్, కుమార్, సత్తి, చంద్రశేఖర్, మనోహర్, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వి.కోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా.తమీంఖాన్ అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ వి.కోట గ్రేటర్, బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో వి.కోట ప్రభుత్వాస్పత్రిలో క్యాన్సర్, గుండెజబ్బులకు సంబంధించి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 241 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 24 మందిని మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఇంద్రేస్, కోశాధికారి ఎస్‌ఏ సాదాత్, జోనల్ చైర్‌పర్సన్ ధీరజ్, లోకేష్, జీఈటీ సభ్యులు సురేంద్రగౌడ, నాగరాజేంద్ర, ఎంఈవో చంద్రశేఖర్, డా.ప్రవీణ్, సభ్యులు తుకారం, చైనారాం, రమేష్, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, మురుగేష్, శంకర్, వైదేహి వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే సంక్షేమ పథకాలు



కందూరులో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ పాలనలోనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నట్లు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కందూరులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా ఇళ్లు, పింఛన్లు వంటి ప్రయోజనాల ఎంపికలో వెనుకడిన సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం నిమ్మనపల్లె రోడ్డు మార్గంలో నూతనంగా నిర్మించిన రైస్ మిల్లును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగల్ విండో అధ్యక్షుడు శివశంకర్, రమేశ్‌నాయుడు, మదన్‌మోహన్‌రెడ్డి, హరిప్రసాద్, సతీశ్, పి.శ్రీనివాసులు, బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమానికి హాజరైన అధికారులు

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేటూరు పంచాయతీ రెడ్డివారిపల్లె గిరిజన కాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని వ్యక్తులు ఆధార్ కార్డును తప్పక పొందాలన్నారు. ప్రభుత్వం గిరిజనులకు కల్పిస్తున్న పలు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు లేవని అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్యలపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మాజీ వైస్‌ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచ్ బాలాజీ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



మంత్రిని కలిసిన ఏఎంసీ చైర్మన్

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సోమల మార్కెట్ యార్డులో పలు వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు విన్నవించారు. గురువారం రాయచోటిలోని టీడీపీ కార్యాలయం వద్ద మంత్రిని కలిసి మార్కెట్‌లో తాగునీటి సౌకర్యం కోసం ఓవర్ హెడ్ ట్యాంకు, కార్యాలయంలో ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం వంటి ప్రత్యేక వసతులు కల్పించాలని విన్నవించారు. అలాగే అసంపూర్తి పనులు వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టేలా చొరవ తీసుకోవాలని కోరారు. మండలంలో ఏనుగుల దాడులతో నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. టీడీపీ నాయకులు సతీశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి



పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎస్.మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పంచాయతీలో చెత్త సేకరించి సంపద సృష్టించాలని.. పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో ఎస్.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన ఇంటింటికీ చెత్త సేకరణ గురువారం మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ గుట్టకింద హరిజనవాడలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు సహదేవ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పలమనేరు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పలమనేరులో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందమున్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉందన్నారు. ఇందుకు అందరూ సహకరించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై సహకరించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ఉత్పత్తి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, పలమనేరులోని ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వామిత్వ పథకంపై అవగాహన అవసరం

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ పథకంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సర్వేయర్లచే ప్రతి గ్రామాన్ని సర్వే చేసి రికార్డులో నమోదు చేయు విధానాన్ని వివరించారు. ప్రతి ఇంటికి ప్రాపర్టీ పర్సనల్ నంబర్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.34 కోట్లతో ధర్మరాజుల ఆలయ నిర్మాణం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ద్రౌపదీ సమేత ధర్మరాజులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

శాంతిపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాలను అభివృద్ధి పరచాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ప్రధాన సంకల్పమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. గురువారం కర్లగట్ట గ్రామంలో నెలకొన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ జీర్ణోద్ధరణ పనులకు వారు మండల టీడీపీ ముఖ్య నేతలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిపురం మండలంలో కర్లగట్ట ధర్మరాజుల దేవాలయానికి రూ.5.34 కోట్లు, రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.7.88 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. అలాగే రామకుప్పం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని ప్రధాన ఆలయాలకు కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జీలు పీవీ నాగరాజు, రాజేంద్ర, యూనిట్ ఇన్‌చార్జీలు గిరిధర్, మణి, లోకేష్, బాలు, ఆంజనేయరెడ్డి, నేతలు బసవరాజు, రుద్రప్ప, మునిరామయ్య, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు శ్యామల, ప్రధాన కార్యదర్శి రూప పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో గురువారం ఆయన విగ్రహ ప్రతిష్ఠకు కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ చేశా రు. ఈ సందర్భంగా తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు విగ్రహ ఏర్పాటుపై సమీక్షించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మునివెంకటప్ప, కార్యదర్శి ఎస్వీ రమణ, కోశాధికారి జ్యోతీశ్వరుడు, సీఎం సురేశ్, మదన్‌మోహన్‌బాబు, కామిశెట్టి నగేశ్, నాగభూషణం రాయల్, వాసుదేవకుమార్, వై. సాంబయ్య, వెంకటరమణ, సదాశివయ్య, హరినారాయణ, హేమగిరి, భాస్కర్, శ్రీరాములు, సాంబశివయ్య, జగన్‌మోహన్, మహేంద్రబాబు రఘు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జనసైనికులు

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు దాడిలో మృతి చెందిన రామకృష్ణమరాజు కుటుంబానికి మండల జనసేన పార్టీ కార్యకర్తలు రూ.40 వేలు ఆర్థిక సాయాన్ని కొత్తూరులో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షు డు నాగభూషణం రాయల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి చేయూతగా ఉండేందుకు ఒకరికి ఉద్యోగం కల్పించడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోలా రామకృష్ణ, కైవారం మురళీ, మణికంఠ, హరినారాయణ, రఘు, ప్రసాద్, అభిషేక్, అష్రఫ్, శ్రీనివాసులు నాయుడు, సోము తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

పుంగనూరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు ఎంపీడీవో లీలామాధవి కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ అధికారులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్టీఏ నిబంధనల మేరకు వారు కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలోగా ఇవ్వాలని చెప్పారు. సమాచార హక్కు చట్టం మేరకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ రెడ్డెమ్మ, ఎంఈవో రెడ్డెన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘనసన్మానం

సోమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు హైస్కూల్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి పదవీ విరమణతో ఆయన్ను గురువారం ఘనంగా సన్మానించారు. వృత్తిలో ఆయన అందరికీ ఆదర్శమని కొనియాడారు. షకీల్, వాసు, దేవిక, హరినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3న కంటి వైద్యశిబిరం

పలమనేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3న పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, రామచంద్రారెడ్డి తెలిపారు. శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ నేత్ర వైద్యులు మురళీ నేత్ర పరీక్షలు చేసి ఆపరేషన్లు అవసరమున్న వారిని గుర్తిస్తారని తెలిపారు. ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని.. చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేకు సింగిల్‌విండో పాలకవర్గ సన్మానం



అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న బయప్పగారిపల్లి సింగిల్‌విండో పాలక వర్గం

పలమనేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని గురువారం బయప్పగారిపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటమునిరెడ్డి, పాలకవర్గ సభ్యులు భాస్కర్, వెంకటరామయ్య శాలువకప్పి ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో అధ్యక్షులుగా వెంకటమునిరెడ్డిని, పాలకవర్గ సభ్యులుగా భాస్కర్, వెంకటరామయ్యలను నియమించడంపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, మల్లీశ్వరరెడ్డి, వెంకటరత్నం,జగదీష్‌నాయుడు, సెల్వరాజు, స్వతంత్రబాబు, కవీంద్రనాయుడు, అమరనాథరెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రెడ్డిఅభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో...

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని గురువారం సాయంత్రం పలమనేరు రెడ్డి అభ్యుదయ సంఘం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జయరామిరెడ్డి, ఉపాధ్యక్షులు రవిచంద్రారెడ్డి, చంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ వెంకటమునిరెడ్డి, జాయింట్ సెక్రటరీ వేమారెడ్డి, గంగాధర్‌రెడ్డి, కోశాధికారి మల్లేశ్వరరెడ్డి, పీఆర్వో శీనురెడ్డి, మంజునాథరెడ్డి, అడ్వైజర్ కిషోర్‌గౌడు, అమరనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగనాథ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, గౌరవాధ్యక్షులు నాగరాజరెడ్డి, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలి

పుంగనూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గత జూన్ 30వ తేదీలోపు అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. దరఖాస్తుదారులు పురపాలకశాఖ నియమ నిబంధనల మేరకు ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు. ఇతర వివరాలకు పట్టణ ప్రణాళిక అధికారులను సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

గుడుపల్లె, జూలై 31 (ఆంధజ్యోతి): గుడుపల్లె రైల్వేస్టేషన్ క్రాస్‌లో మురుగు కాలువ నిర్మాణానికి టీడీపీ మండలాధ్యక్షులు బాబు నాయుడు గురువారం భూమి పూజ చేశారు. సుమారు రూ.10 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ కృష్ణమూర్తి, నాయకులు రమేష్, మంజునాథ్, భానుమూర్తి, అంబరీష్, సుబ్రహ్మణ్యం నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు భద్రతపై పోలీసుల తనిఖీలు



బ్యాంకు మేనేజర్‌తో చర్చిస్తున్న ఎస్సై

పుంగనూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకులు, ఏటీఎంల భద్రతపై గురువారం పోలీసులు తనిఖీలు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఇటీవల అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లో బ్యాంకుల్లో చోరీలు జరగడంతో చోరీలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బ్యాంకుల్లో సీసీ కెమెరాలు, లైటింగ్, స్ట్రాంగ్ రూమ్ భద్రత, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు తదితర అంశాలపై తనిఖీలు చేసి ఎస్పీకి నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. బ్యాంకు ముందు భాగం, లోపల నాలుగు వైపుల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకు తనిఖీల్లో ఎస్ఐలు హరిప్రసాద్, రమణ, ట్రైనీ ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

రేపటినుంచి 'ఐరాల ప్రభుత్వ బడి' వజ్రోత్సవాలు

ఐరాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సీతాపతినాయుడు గురువారం తెలిపారు. శని, ఆదివారాల్లో జరిగే ఈ కార్యక్రమానికి తొలితరం విద్యార్థులైన అమరరాజ ఛైర్మన్ గల్లారామచంద్రనాయుడు, రిటైర్ ప్రొఫెసర్ కేఎస్ఎస్ శేషన్, ఎ.ఆదినారాయణరెడ్డి, ఆర్.నరసింహన్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజలకు ఉచిత క్యాన్సర్ అవగాహన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ శిబిరానికి బెంగళూరుకు చెందిన శంకర క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ వారు వచ్చి.. పరీక్షలు ఉచితంగా చేస్తారని పూర్వ విద్యార్థులు వివరించారు.

కొత్తపేటలో రంగునీటి ప్రవాహం



కొత్తపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న రంగునీరు

నగరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కొత్తపేట రోడ్డుపై రంగునీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకుని గురువారం నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్‌లు వెళ్లి పరిశీలించారు. భజనగుడి వీధిలో రంగునీరు లీకై ప్రవహిస్తున్నా.. చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. రాజకీయపార్టీలకు అతీతంగా రంగు అద్దక పరిశ్రమల ద్వారా వెలువడే రసాయన నీటిని ఈటీపీ ప్లాంట్‌కి అనుసంధానం చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నా మున్సిపల్ అధికారులు, పొల్యూషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాషా, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో గదుల నిర్మాణానికి చర్యలు



సీహెచ్‌సీ వద్ద అధికారులు

పెనుమూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పాత పీహెచ్‌సీ భవనంలోనే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను కొనసాగిస్తుండటంతో గదుల కొరత కారణంగా వైద్యులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఈ విషయాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు తీసుకెళ్లారు. నూతన భవనం పూర్తయ్యేలోపు ప్రస్తుతం సీహెచ్‌సీని నిర్వహిస్తున్న చోటే మూడు నూతన గదులు నిర్మించడానికి రూ.20 లక్షలను కలెక్టర్ కేటాయించారు. ఈ గదుల నిర్మాణానికి గురువారం పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ ఆనంద్‌రెడ్డి, ఏఈ గురవారెడ్డి తమ సిబ్బందితో కలిసి మార్కింగ్ ఇచ్చారు. డ్రైన్ పైపులు బ్లాక్ కావడంతో ఆ సమస్యను పరిష్కరించారు. మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, డాక్టర్ సంతోష్, హెడ్ నర్సు నిర్మల, టీడీపీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, రెడ్డెప్ప, భాస్కర్, చిరంజీవిరెడ్డి, రాజగోపాల్‌నాయుడు, గంగాధరం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మా పాఠశాల స్థాయి తగ్గించొద్దు



యనమలమందలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం యనమలమంద మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిని ప్రాథమిక బడిగా తగ్గించేసి 6,7,8 తరగతులను ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం సరికాదంటూ విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. 53 రోజులుగా తాము బడికి వెళ్లడం లేదని తెలిపారు. ఈ విషయమై ఎంఈవో దామోదరం నిబంధనల మేరకే విలీనం చేశామని చెబుతున్నారు. 6,7,8 తరగతుల్లో 45 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని జడ్పీ ఉన్నత పాఠశాలగా మార్చాలంటే 60 మంది విద్యార్థులతోపాటు కనీస వసతులు ఉండాలన్నారు. ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి ట్రావెల్ అలవెన్సు ఇస్తారని చెప్పినా విద్యార్థులు వినడం లేదన్నారు. విద్యార్థుల నిరసనకు గురువారం జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ సంఘీభావం తెలిపారు.

దళిత గ్రామాల్లో వసతుల కల్పన: తహసీల్దార్

యాదమరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దళిత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తహసీల్దారు పార్థసారథి అన్నారు. గురువారం ఓటివారిపల్లె గ్రామ పంచాయతీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. ఎంపీడీవో వేణు, సర్పంచ్ భగవతి, మండల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మురగేష్, హెన్రీ థామస్, నాగరాజు, రమణ, కుమార్, గిరిబాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని కృష్ణా యానాదికాలనీలో జరిగిన సమావేశంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్ ప్రసంగించారు. ఏఈలు భరత్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో కమిషనర్ పరిశీలన



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి స్మశానవాటికను నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదుతో ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్రలతో కలిసి వచ్చారు. అక్కడ ముళ్లకంపలు, వ్యర్థాలు చూసి తొలగించాలని చెప్పడంతో అధికారులు పనులను చేపట్టారు. అనంతరం హైరోడ్డులోని మండీ వీధిలో పర్యటించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారంపై అధికారులతో చర్చించారు. కాలువల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి బస్సు నడపండి

వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సు నడపాలని విద్యార్థులు గురువారం విజ్ఞప్తి చేశారు. కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు రావడానికి బస్సు సదుపాయం సరిగా లేదని తెలిపారు. దీనివల్ల ఉదయం 7.45 గంటలకే బడికి వస్తున్నామని, సాయంత్రం 5.30 గంటలైనా బస్సు రావడం లేదన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

209మందికి కొత్తగా వితంతు పింఛన్లు

గంగాధరనెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 209మందికి వితంతు పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్ తెలిపారు. సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్న వయోవృద్ధులైన పురుషులు వివిధ కారణాలతో చనిపోగా వారి భార్యలు 209 మందికి కొత్తగా వితంతు పింఛన్లు ఆగస్టునెలకు మంజూరైనట్లు చెప్పారు.

కాలువల పనులకు ప్రాధాన్యమివ్వండి

పాలసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో అటవీప్రాంతం నుంచి చెరువులకు నీరందించే కాలువల పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీవో మార్గరేట్, ఈసీ రామ్మూర్తి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం అమ్మపల్లె క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన ఇద్దరు గాయపడ్డారు. ఆళ్లమడుగుకు చెందిన నాగరాజు(60), కొత్తపల్లి చెన్నయ్య(65) ఇద్దరూ బైక్‌లో తమిళనాడులోని పళ్లిపట్టుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా కార్వేటినగరం మండలం అమ్మపల్లె క్రాస్ రోడ్డు చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై బైక్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కార్వేటినగరం పోలీసులకు సమాచారం అందించారు.

మతాశిశు మరణాలు నివారించండి

- ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్

చిత్తూరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):మతాశిశు మరణాలు నివారించాలని ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో సుధారాణికి సూచనలిచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఎంవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల ఇన్‌చార్జి ఎస్ఐగా వెంకటేశ్వర్లు

ఐరాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఐరాల పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐగా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కల్లూరు ఎస్ఐగా పనిచేస్తున్నారు. తాను గతంలో ఈస్టేషన్‌లో పనిచేశానని, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం: ఎస్ఈ

విజయపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ తెలిపారు. శ్రీహరిపురం ఎస్టీ కాలనీ గ్రామాన్ని దత్తతగా తీసుకుని కనీస సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు గురువారం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. తాగునీటి ట్యాంకు, కాలువలను పరిశీలించారు. డీఈ శ్రీహరి, ఏఈ శివరామకృష్ణ, ఎంపీడీవో రాజేంద్ర, సర్పంచ్ రాణెమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎస్ఈ విజయకుమార్

చెరువులో దుర్గంధం

చిత్తూరు కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గానగర్ కాలనీలోని కుమ్మరవాని చెరువులో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు తెలిపారు. దీనిపై కార్పొరేటర్‌కు, నగరపాలక సంస్థ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని కాలనీవాసుల ప్రతినిధి ఎన్.కేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

శ్రీరంగరాజపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం మండలంలోని బసివిరెడ్డి గ్రామంలో నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, దాత గంగినేని కృష్ణయ్య, సర్పంచ్ డి.వి.డిల్లెయ్య గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయబాబు, కోటిరెడ్డిబాబు, గంగినేని చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పక్కాగా చేయాలి : డీపీవో

యాదమరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ సర్వేను పక్కాగా చేయాలని డీపీవో సుధాకరరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లకు స్వామిత్వ సర్వేపై సమగ్రశిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో భూ వివిధాలను తగ్గించడమే స్వామిత్వ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. సర్వేను పక్కాగా చేయడంలో సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. స్వామిత్వ సర్వేలో సాంకేతిక పరికరాలు ఉపయోగించే విధానం క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. డేటా సేకరణ, సరిహద్దులు గుర్తింపు, మ్యాపింగ్, రికార్డుల నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో సుధాకరరావు

అరగొండ సింగిల్‌విండో అభివృద్ధికి కృషి: చైర్మన్

తవణంపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అరగొండ సింగిల్ విండో అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్‌గా నియమితులైన రంజిత్ రెడ్డి అన్నారు. గురువారం కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అలాగే డైరెక్టర్లుగా పైమాఘంకు చెందిన విజయ్‌కుమార్, అరగొండకు చెందిన వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. వీరితో డీఎల్‌సీవో కార్యాలయ సూపరింటెండెంట్ రవీంద్రనాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటానని స్పష్టం చేశారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లను టీడీపీ, జనసేన నాయకులు సన్మానించారు. మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్ కుమార్, నాయకులు గిరిబాబు, చిన్న, మోహన్, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



అరగొండ సింగిల్‌విండో చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న రంజిత్ రెడ్డి

సంక్షిప్తంగా..

'కాపీ కొట్టను.. పక్క చూపు చూడను'

వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆళ్లమడుగు జడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం 'కాపీ కొట్టను.. పక్క చూపు చూడను' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన.. ఉన్న స్థితి నుంచి ఉన్నతమైన స్థితి, ఉన్నతమైన స్థితి నుంచి ఉత్తమమైన స్థితికి చేరుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

టీచర్‌కు సన్మానం



వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం టీకేఎంపేట జడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ హమీద్ సేవలు అభినందనీయమని సహచర ఉపాధ్యాయులు కొనియాడారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఆయన్ను గురువారం సన్మానించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పాలసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురంలో సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. వనదుర్గాపురంలో శ్రీకృష్ణ భజన మందిరం నుంచి సుబ్రహ్మణ్యం రాజు ఇంటి వరకు ఈ రోడ్డును నిర్మిస్తామని పీఆర్ ఏఈ జయరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, నవీన్‌చౌదరి, సాయిరాజు, సుబ్రహ్మణ్యం మందడి, శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వే పకడ్బందీగా చేయండి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న లోకేష్, పద్మాంజలి దేవి

బంగారుపాళ్యం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ సర్వేను పకడ్బందీగా చేయాలని ఐసీఎంఆర్ పీడీ డాక్టర్ లోకేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో మహిళ మృతదేహం



వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలోని కోట చెరువులో గురువారం ఓ మహిళ(35) మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె గుర్తు తెలియని, మతిస్థిమితం లేని మహిళగా పోలీసులు అనుమానిస్తున్నారు. చెరువు వైపు వెళ్లి కాలు జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేశారు.

చంద్రబాబు హయాంలోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



కరపత్రాలతో టీడీపీ నాయకులు

నగరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగరి మండల టీడీపీ నాయకులు తెలిపారు. మాంగాడులో టీడీపీ మండల కార్యదర్శి వేణు, మాజీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నారాయణస్వామి నాయుడు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో వరలక్ష్మి

తవణంపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తొడతర జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈవో వరలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, హాజరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని పరిశీలించి వంట తయారీకి గ్యాస్ మాత్రమే వాడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంఈవోలు హేమలత, మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చిత్తూరులో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి'

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సభ్యులు కోరారు. గురువారం అధ్యక్షుడు తాండవమూర్తి ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సభ్యులు కలిసి వినతిపత్రాన్ని అందించారు. వావిల్‌తోట వద్ద శివ, వైష్ణవ ఆలయ పునరుద్ధరణ, కలవకుంట వద్ద 108 అడుగుల శివుడి విగ్రహాన్ని, చిత్తూరు నాలుగు ప్రధాన కూడలి ప్రాంతాలలో నెమలి, గరుడ, నంది విగ్రహాలను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. చంద్రబాబు, అశోక్‌కుమార్, నాగేంద్ర, శివకుమార్, రసీద్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం టూరిజం మేనేజర్ గౌరీని కలిసి చిత్తూరును టూరిజం కారిడార్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక నివేదికను అందజేశారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు

గుర్రప్పస్వామి ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మోటకాంపల్లెలో నూతనంగా నిర్మించిన గుర్రప్పస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలకు గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు.

ఒక్కరోజు ముందుగా పుట్టినరోజు వేడుకలు

ఎమ్మెల్యే మురళీమోహన్ పుట్టినరోజును ఆయన అభిమానులు ఒక్కరోజు ముందుగా గురువారం నిర్వహించారు. చిత్తూరులోని స్వగృహంలో ఆయనచేత కేక్‌ను కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ముస్లిం నాయకుడు ఖయ్యూంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళీమోహన్‌కు కేకు తినిపిస్తున్న మణినాయుడు →



ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ తీసుకోవాలి: ఎంపీడీవో

వెదురుకుప్పం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు పిల్లలందరికీ జనన సర్టిఫికెట్ల సాయంతో ఆధార్ తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పురుషోత్తం సూచించారు. గురువారం తన సమావేశపు మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాలకు ఆధార్ ఎంత అవసరమో తెలియజేయాలని సూచించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) కార్వేటినగరం కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ: ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కలిగిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం ఇరుగువాయి పంచాయతీ పర్వత రాజపురం ఎస్సీ కాలనీకి ఉపాధి హామీ కింద రూ.కోటి ఏడు లక్షల నిధులతో మంజూరైన తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇరుగువాయి మాజీ ఎంపీటీసీ కాంచన మురళి వితరణతో విద్యార్థులకు విద్యాసామగ్రి ఎమ్మెల్యే అందజేశారు. చిత్తూరు పార్లమెంటు జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు బాలాజి, వెంకటేశ్వరరావు మీరా, అధికారులు పాల్గొన్నారు.



తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ఉద్యోగ విరమణ సన్మానం

చిత్తూరు అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ టీసీ బాబును గురువారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ మణికంఠ హాజరయ్యారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీ మహబూబ్‌బాష, సీఐ మహేశ్వర్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.



బాబు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ మణికంఠ, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్ తదితరులు

అంతర్జాతీయ సమస్యలపై విద్యార్థులకు అవగాహన



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఎఫ్‌వో భరణి తదితరులు

తవణంపల్లె, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దిగువమాఘంలోని అమరరాజా విద్యాలయంలో మోడల్ యునైటెడ్ నేషన్స్ ఎడిషన్-1 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్‌వో భరణి మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల వల్ల అంతర్జాతీయ సమస్యలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అగాఖాన్ అకాడమీ ఎకనామిక్స్ అధ్యాపకురాలు మీనా జ్ఞానదేశికన్, అమరరాజా ఎడ్యుకేషనల్ కార్యదర్శి సతీష్, చిత్తూరు, తిరుపతి జిల్లాలలోని 20 సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పరికరాలతో అధిక లాభం

చిత్తూరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పరికరాలతో రైతుకు లాభం చేకూరుతుందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మిందలో అనంతపురం జిల్లాకు చెందిన దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పరికరాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.


జన్మదిన
శుభాకాంక్షలు
చంద్రన్న ఆశయ రథసారథిగా..
పూతలపట్టు నియోజకవర్గ
ప్రజల గొంతుకగా..
ఉవ్వెత్తున ఎగసి పడే కడలి కెరటంలా...
నవతరం ఉత్సాహానికి ఊపిరిలూదే
యువ ప్రతినిధిగా...
పేదలగుండెల్లో
చెరగని సుస్థిర స్థానం
ఏర్పరచుకుని
జనం కోసమే మనం అంటూ...
పరితపించే ఆత్మీయ
పూతలపట్టు శాసనసభ్యులు
శ్రీ కె.మురళీ మోహన్ గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ బండి హరిప్రసాద్ గారు
డైరెక్టర్
బంగారుపాళ్యం మార్కెట్ యార్డు
శ్రీ కె.మురళీమోహన్ గారు
శాసనసభ్యులు, పూతలపట్టు
మా ఆత్మీయ నాయకుడు శ్రీ బండి హరిప్రసాద్ గారు
బంగారుపాళ్యం మార్కెట్ యార్డు డైరెక్టర్ గా ప్రమాణస్వీకారం
చేయుచున్న శుభ సందర్భంగా వారికి మా హృదయపూర్వక
ప్రమాణస్వీకారోత్సవ శుభాకాంక్షలు. మీరు భవిష్యత్తులో
మరెన్నో ఉన్నత పదువుల అలంకరించాలని కోరుకుంటూ..
"బండి" గోవర్ధన్ నాయుడు
"బండి"గోపి నాయుడు
"బండి"వేణు నాయుడు
"బండి"ఆనంద నాయుడు
బొబ్బా జయచంద్ర నాయుడు
సి.బాలకృష్ణ నాయుడు
సొప్పా వెంకట్
సొప్పా నాని
"బండి"సుమంత్
వి.కిషోర్
"బండి"నితీష్
"బండి"మహేష్
"బండి" రాఘవ
సాయి


జన్మదిన మరియు పదవిప్రమాణ
స్వీకార మహోత్సవ
శుభాకాంక్షలు
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆశీస్సులతో మా అన్న గారైన
శ్రీ కలికిరి మురళి మోహన్ గారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు.
బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న
శ్రీ కె.భాస్కర్ నాయుడు గారికి మరియు డైరెక్టర్లకు హార్థిక శుభాకాంక్షలు.
కె.సి.మధుసూదన్ రావు
మాజీ సర్పంచ్,
కాణిపాకం
వి.మణి నాయుడు, మాజీ చైర్మన్,
కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం
కాకర్ల హేమాద్రి నాయుడు
కాణిపాకం
ఆర్.నరసింహులు నాయుడు
టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి
కె.సి. పూర్ణచంద్ర రావు
కాణిపాకం
ఆర్. రమేష్ నాయుడు
కాణిపాకం
కె.శెల్వం
కాణిపాకం
కలికిరి మురళీ మోహన్
శాసనసభ్యులు, పూతలపట్టు
కె. భాస్కర్‌నాయుడు
బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ
చైర్మన్


జన్మదిన శుభాకాంక్షలు
యువకులకు స్ఫూర్తివై... శ్రామికుల శక్తివై... ప్రజా సేవకు నిర్వచనమై...
ముందుకు వడివడిగా సాగుతూ.. మమ్ములను ముందుకు నడుపుతున్న
విలువలెరిగిన మా ఆత్మీయ నాయకులు శ్రీ మురళీ మోహన్ గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. కలియుగ దైవం
శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో మరెన్నో పుట్టినరోజు వేడుకలు
జరుపుకోవాలని కోరుకుంటూ...
గంగారపు గోపి
చంద్రబాబు నాయుడు
దొరబాబు చౌదరి
శ్రీ కె.మురళీమోహన్ గారు
శాసనసభ్యులు, పూతలపట్టు


ప్రమాణస్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
శ్రీ కె. భాస్కర్ నాయుడు గారు
ఒడ్డిపల్లె గ్రామం, తవణంపల్లె మండలం
వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, బంగారుపాళ్యం
శ్రీ డా॥ కె.మురళీ మోహన్ గారు
ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గం
నిగర్వి, నిరాడంబరులు, మా కుటుంబ సభ్యుడైన శ్రీ కె. భాస్కర్ నాయుడు గారు నేడు బంగారుపాళ్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేడు ప్రమాణస్వీకారం చేయుచున్న సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు. మరియు పూతలపట్టు నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ డా॥ కె.మురళీ మోహన్ గారికి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
కె.భూచంద్ర నాయుడు
కె.సోమయ్య నాయుడు
కె.ఆనంద బాబు
మరియు కుటుంబ సభ్యులు


పదవీ విరమణ శుభాకాంక్షలు
శ్రీమతి ఆర్. లలిత
Deputy Librarian (I/C)
జిల్లా గ్రంధాలయ సంస్థ, చిత్తూరు
ప్రెసిడెంట్, జిల్లా గ్రంధాలయ సంస్థ ఉద్యోగుల సంఘం
చిత్తూరు జిల్లా
శ్రీ పి. భక్తవత్సలం
Ex. BSNL - TVS
వృత్తినే దైవంగా భావించి, అంకిత భావంతో పనిచేసి, అందరి మన్ననలు పొంది, మాకు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా వుంటున్న మా కుటుంబ ఆత్మీయ శ్రేయోభిలాషి
శ్రీమతి ఆర్.లలిత గారు
చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్‌గా పదవీ విరమణ చేయు శుభసందర్భంగా మా హార్ధిక శుభాకాంక్షలు.
వీరి శేషజీవితం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో గడపాలని శ్రీ వేంకటేశ్వరస్వామిని కోరుతూ... కోరుకుంటూ...
ఎస్.చంద్రప్రకాష్
చిత్తూరు పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్
ఎస్.గీర్వాణి చంద్రప్రకాష్
మాజీ జడ్.పి. ఛైర్‌పర్సన్, చిత్తూరు
ఎస్.గీర్వాణి చంద్రప్రకాష్ కుటుంబ సభ్యులు
ఎస్.స్నేహ, అజిత్ రాజ్
పిల్లలు అకీరా, శిశిరా
ఎస్.చైత్ర, చరన్
మాస్టర్ రామ్


శుభాకాంక్షలు
TELUGU DESAM PARTY
ఎన్.పి. జయప్రకాష్
మండల టీడీపీ గౌరవ అధ్యక్షులు
బంగారుపాళ్యం
ఎన్.పి.ధరణి ప్రసాద్
మండల టీడీపీ అధ్యక్షులు
బంగారుపాళ్యం
ఎన్.పి.జయచంద్రనాయుడు
మాజీ మార్కెట్ కమిటి చైర్మన్
బంగారుపాళ్యం
ఎన్.పి.సురేంద్రనాయుడు
మండల టీడీపీ మాజీ అధ్యక్షులు
బంగారుపాళ్యం
పూతలపట్టు శాసనసభ్యులు గౌ॥ శ్రీ డా॥ మురళీమోహన్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
బంగారుపాళ్యం మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయుచున్న గౌ॥ శ్రీ కె. భాస్కర్‌నాయుడు గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.
బి.హేమచంద్రనాయుడు
సింగిల్ విండో అధ్యక్షులు
ఎన్.పి. విక్రమ్
బి.లోకనాథంనాయుడు
మండల పార్టీ ఉపాధ్యక్షులు, తగ్గువారిపల్లి
బి.సి. రవీంద్రనాయుడు
టీడీపీ నాయకులు, గుంతూరు
వై.కమలనాథరెడ్డి
మండల పార్టీ ఉపాధ్యక్షులు, దండువారిపల్లి
కోకా ప్రకాష్‌నాయుడు
జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, యర్రండ్లపల్లి
బి. జనార్ధన్‌గౌడ్
మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, నల్లగాంపల్లి
కోదండయాదవ్
జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి, తుంబపాళ్యెం
మోహన్‌నాయుడు
క్లస్టర్ ఇన్‌చార్జి, వెంకటాపురం
రమేష్
క్లస్టర్ ఇన్‌చార్జి, తుంబకుప్పం
గురుజాల సురేంద్రనాయుడు
యూనిట్ ఇన్‌చార్జి, మడుపోలూరు నల్లగాంపల్లి
మాధవనాయుడు
వాణిజ్య విభాగ అధ్యక్షులు, ఎన్.పి. నగర్
జి. రవీంద్రనాయుడు
ఆయకట్టుదారుల చైర్మన్, మాధవనగర్
ఎన్.పి.రాధక్రిష్ణనాయుడు
యూనిట్ ఇన్‌చార్జి బంగారుపాళ్యం
ధనంజయనాయుడు
ఆయకట్టుదారుల చైర్మన్, మొగిలి.
మంజునాథ్
యూనిట్ ఇన్‌చార్జి, మొగిలి.
బుస్సా నాగరాజగౌడ్
ఈడిగ సాధికార పార్లమెంట్ అధ్యక్షులు, నల్లగాంపల్లి.
స్వామిదాస్
మండల ఎస్సీసెల్ అధ్యక్షులు, నల్లగాంపల్లి.
టి.కె.హరిప్రసాద్
సింగిల్ విండో డైరెక్టర్, ఈచినేరిపల్లి.
కొండేటి శివ
టిఎన్‌టియుసి మాజీ అధ్యక్షులు, కొండేటివాళ్ళూరు
సూరి (మెడికల్)
బిపిఎం ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్, ఎన్.పి.నగర్.
బాలక్రిష్ణనాయుడు
యూనిట్ ఇన్‌చార్జి, రాగిమానుపెంట.
వి. గజేంద్ర
రైతు విభాగం మండల అధ్యక్షులు, లక్ష్మీపురం
డా॥ మురళీమోహన్
శాసనసభ్యులు, పూతలపట్టు
కె. భాస్కర్‌నాయుడు
బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్